
మట్టి గణపయ్యలే ముద్దు

చిన్నాపెద్దా తేడా లేకుండా సంతోషంగా జరుపుకునే పండుగ వినాయక చవితి. ఇందులో భాగంగా ప్రతి వీధిలోనూ వినాయకుడి విగ్రహాలను ప్రతిష్టించి మూడు నుంచి తొమ్మిది రోజులు పూజలు చేస్తారు. తర్వాత నదులు, చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తారు. ఈ క్రమంలో వినాయకుడి విగ్రహాలకు డిమాండ్ ఎక్కువగా వుంటోంది. కొందరు పీవోపీతో విగ్రహాలను తయారుచేసి విక్రయిస్తున్నారు. ఈ నెల 27న జరుపుకునే వినాయక చవితి కోసం ఇప్పటికే భారీ సంఖ్యలో పీవోపీ వినాయకుడి విగ్రహాలను తయారుచేసేశారు. పీవోపీ వల్ల పర్యావరణ కాలుష్యం కలుగుతుందని, మట్టి వినాయకుడి విగ్రహాలను పూజించాలని పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు.



ప్రకృతికి మేలు చేసే మట్టి వినాయకుని ప్రతిమలు

- పీవోపీతో పర్యావరణానికి ముప్పు
- మట్టి విగ్రహాలకు పెరుగుతున్న ఆదరణ
- ఆరోగ్యకరమైన పర్యావరణం సామాజిక బాధ్యత
- స్వచ్ఛంద సంస్థలు మరింత చైతన్యం కల్పించాలి



ప్రమాదకర పీవోపీ విగ్రహాలు

పలమనేరు: వినాయక చవితి సందర్భంగా ప్రతిష్టించే వినాయకుడి విగ్రహాలను ఎక్కువ మంది ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్(పీవోపీ)తో తయారుచేస్తారు. జిప్సంను 120 నుంచి 180 డిగ్రీల వరకు వేడిచేస్తే పీవోపీ తయారవుతుంది. దీని రసాయన నామం క్యాల్షియం సల్ఫేట్ హెమీహైడ్రేట్. ఇది 25 సెంటీగ్రేడ్ల ఉష్ణోగ్రత వద్ద నీటిలో ద్రావణీయత 0.3 గ్రాములుగా ఉండి నీటిలో ముంచగానే గట్టి పదార్థంగా మారుతుంది. 18వ శతాబ్దంలో ప్యారిస్ చుట్టూ లభ్యమయ్యే జిప్సంను భారీస్థాయిలో మైనింగ్ చేసి దీన్ని తయారుచేశారు. నాటి నుంచి దీనికి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ అనే పేరొచ్చింది. వాస్తవంగా దీన్ని విరిగిన ఎముకలు, కీళ్ల అచ్చులకు ఉపయోగిస్తారు. అంతేగాక ఇళ్ల పైకప్పులు, అలంకరణలు, నల్లబల్ల తదితరాలను తయారు చేస్తారు. దీంతో చేసిన విగ్రహాలను నీటిలో పడేయంతో ఆ నీరు రసాయనాలతో కలుషితమవుతోంది. ఇవి త్వరగా భూమిలో కరగదు. నీటిలో జిప్సంగా మారి ప్రాణవాయువు స్థాయి తగ్గిస్తోంది. తద్వారా జలచరాలకు ప్రాణవాయువు అందకచనిపోయే ప్రమాదం వుంది. పీవోపీ భూమిలోకి నీటిని ఇంకనీయకుండా అడ్డుకుంటుంది. నీటి ఆమ్లత్వాన్ని, టీడీఎస్(టోటల్ డిస్సాల్వ్‌డ్ సాలిడ్స్)ను పెంచుతుంది. పీవోపీతోబాటు ఉపయోగించే రంగుల్లో హానికరమైన పాదరసం, క్యాడ్మియం, సీసం నీటిలో చేరడం వల్ల కిడ్నీలు, నాడీ వ్యవస్థ దెబ్బతింటాయి.

మట్టివిగ్రహాలపై పెరుగుతున్న ఆదరణ

పీవోపీ వల్ల కలిగే అనర్థాలపై ఇప్పుడిప్పుడే ప్రజల్లో చైతన్యం వస్తోంది. ఇదో సామాజిక బాధ్యతగా భావించి పీవోపీ విగ్రహాలకు బదులు మట్టి వినాయకుడి విగ్రహాలను పూజించేందుకు సిద్ధమవుతున్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రతి ఏటా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కుమ్మర, శాలివాహన సంఘాలు మట్టి బొమ్మల ఆవశ్యకతను తెలియజేస్తున్నాయి. దీంతో ప్రజలు మట్టి వినాయకులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

మట్టి వినాయకులతో ప్రయోజనాలెన్నో



మట్టితో చేసిన వినాయకుడి విగ్రహాలను పూజించాలి. వాటితో అనేక ప్రయోజనాలు వున్నాయి. మట్టి నీటిలో సులభంగా కరిగిపోతుంది. చెరువులోని బంకమట్టిని తీయడం వలన నీటి నిల్వ శాతం పెరిగి భూగర్భ జలాలు పెంపొందుతాయి. వీటిని తయారు చేసేవారికి ఆర్థిక భరోసా కలుగుతుంది. మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపడుకుందాం.

–యుగంధర్, జేవీవీ నాయకులు, పలమనేరు

స్వచ్ఛంద సంస్థలు మరింత దృష్టి పెట్టాలి



పర్యావరణంతోపాటు ప్రకృతి సమతుల్యాన్ని కాపాడుకోవాలనే విషయాన్ని ప్రజలకు వివరించాలి. మట్టి విగ్రహాల వాడకంపై ప్రజలు ఆసక్తి చూపేలా అవగాహన కల్పించాలి. పీవీపీ విగ్రహాలపై జనం మోజుపడుతున్నారు. ఇప్పుడు వినాయక చవితి సీజన్ మొదలైంది కాబట్టి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పీవోపీ వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలి.

–సోమచంద్రారెడ్డి, మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షులు

క్లుప్తంగా

మహిళా పోలీసులకు జరిమానా వసూళ్ల బాధ్యత

పలమనేరు: రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులకు పోలీసులు జరిమానా విధించి అక్కడికక్కడే వసూలు చేస్తుంటారు. ఇంటర్ సెప్టార్ లేదా స్పీడ్ కెమెరాల ఆధారంగా వాహనాలకు విధించే జరిమానాలను సైతం పోలీసులే వసూలు చేస్తారు. జరిమానా చెల్లించని వారి జాబితా పెరిగినట్టు సమాచారం. ఈ క్రమంలో వారి నుంచి జరిమానా వసూలు చేసే బాధ్యతను పోలీసులు ఆయా సచివాలయాల పరిధిలోని మహిళా పోలీసులకు అప్పగించారు. వారు సంబంధిత ఫోన్ నంబరుకు కాల్ చేసి జరిమానా కట్టించేందుకు నానాతంటాలు పడుతున్నారు. వాహనాలు చాలా చేతులు మారుతున్న క్రమంలో ఎప్పుడో విధించిన జరిమానాలను తమకు ఏమి సంబంధమని వాహనాలను కొనుగోలు చేసిన వారు నిలదీస్తున్నారు. దీనికితోడు చలానాలో ఫోన్ నంబరు, వాహనదారు పేరు మాత్రమే ఉంటుంటోంది. ఇంటి చిరునామా లేకపోవడంతో వారి అడ్రస్ తెలుసుకోవడం మహిళా పోలీసులకు పెద్ద సమస్యగా మారింది. ఉన్నతాధికారులు చెప్పిన పనులు చేయాల్సిందే కాబట్టి కాదనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు కొంతమంది మహిళా పోలీసులు వాపోతున్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

చౌడేపల్లి: మండల ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్ గురువారం పుదిపట్ల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని తిని రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. లేదా అని ఆరా తీశారు. స్టాక్ రూములో బియ్యం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. డీఈ సోముశేఖర్, ఏఈ సురేష్, ఎంపీడీవో లీలామాధవి, హెచ్ఎం పద్మజ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి



రికార్డులను పరిశీలిస్తున్న వేణుగోపాల్

బైరెడ్డిపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తెలిపారు. ఆయన గురువారం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. మలేరియా, డెంగీ జ్వరాల బారిన పడిన వారి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పూర్తి స్థాయిలో వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికా రులు విజయ్‌చంద్ర, షాలిని, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ పాల్గొన్నారు.

రేపు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కుప్పం: పట్టణంలోని గుడుపల్లె రోడ్డులో వున్న శ్రీకృష్ణార్జున ఆలయంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ దయానిధి తెలిపారు. ముందుగా స్వామికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పుష్పాలంకరణ, తీర్థ ప్రసాద వినియోగం చేస్తామని వెల్లడించారు. సాయంత్రం శ్రీకృష్ణ భగవానుడి ఉత్సవ మూర్తిని పట్టణంలో ఊరేగిస్తామని చెప్పారు.

పొలాల్లోకి దారి కల్పించాలని నిరసన



నిరసన తెలుపుతున్న కామినేపల్లె రైతులు

బైరెడ్డిపల్లి: బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేతో పొలాల్లోకి దారిలేక ఇబ్బంది పడుతున్నామని కామినేపల్లె గ్రామస్తులు వాపోయారు. వారు గురువారం ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. పాడిపశువులతో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామం నుంచి పొలాలకు వెళ్లేందుకు గతంలో రోడ్డు ఉండేదని తెలిపారు. ఎక్స్‌ప్రెస్ హైవే వల్ల రోడ్డు లేకుండా పోయిందని, దారి సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి నాలుగు సార్లు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వందలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు.

అనుమానితులతో జాగ్రత్తగా ఉండాలి



సీసీ పుటేజీలో నమోదైన చైన్ స్నాచర్ ఫొటో

గంగవరం: అనుమానితులతో ప్రజలు అప్రమత్తంగా వుండాలని గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ చైన్ స్నాచర్లు ఇళ్లలో ఒంటరిగా ఉంటున్న మహిళలను టార్గెట్ చేసి వారి మెడలోని బంగారు నగలను లాక్కెళుతున్నారని తెలిపారు. ముఖానికి మాస్కు ధరించి స్కూటీలో తిరుగుతూ మహిళ బంగారు గొలు సులు లాక్కొని వెళుతున్నారని తెలిపారు. ఇటీవల దుండగుడు మహిళ మెడలో గొలుసు లాక్కెల్లాడని, అతని చిత్రం సీసీ పుటేజీ ద్వారా లభ్యమైందని తెలిపారు. అతన్ని త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఈ వ్యక్తి ఎక్కడైనా కనిపిస్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

రైతులకు పట్టాలు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి

రొంపిచెర్ల: గత ప్రభుత్వం పేదలకు భూ పంపిణీలో మంజూరు చేసిన పట్టాలు రైతులకు అందజేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు భూ పంపిణీ పథకం కింద బంజారు భూములు కేటాయించిందని తెలిపారు. వారికి ఇవ్వడానికి సిద్ధం చేసిన పట్టాదారు పాసు పుస్తకాల్లో తహసీల్దార్ సంతకం చేయకపోవడంతో అందజేయలేకపోయినట్టు తెలిపారు. తగిన చర్య లు తీసుకుని పట్టాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్డు పక్కన కాకుండా దూరంగా ఏర్పాటుచేయాలన్నారు. తహసీల్దార్ అమర్నాథ్ మాట్లాడుతూ పట్టాల పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాన్స్‌కో ఏఈ రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లకు రైతులు స్థలాలు ఇవ్వకపోవడంతోనే రోడ్డు పక్కన ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సోలార్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు రైతులు ముందుకు రావాలన్నారు. ఇళ్లకు సోలార్ విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. సబ్సిడీతో జొన్న, మొక్క జొన్న విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపామని పశు వైద్యాధికారి ఉష తెలిపారు. డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ పీహెచ్‌సీలో కుక్క కాటుకు మందుల కొరత ఉందన్నారు. ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని వీధుల్లో తిరిగే కుక్కలకు ఇంజెక్షన్లు వేయించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సీడీపీవో వాణి శ్రీదేవి, ఇన్‌చార్జి డీవైఈవో ఇందిర, పీహెచ్‌సీ డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్, ఏవో శ్రావణి, ఎంపీటీసీలు సీరాజున్నీసా, రమణమ్మ, సంపూర్ణమ్మ, సర్పంచ్ సుధారాణి, ఏపీవో బాలమురళి, ఏపీఎం హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

పుంగనూరు: పట్టణ సమీపంలోని కృష్ణమరెడ్డిపల్లె రోడ్డులో వున్న శ్రీకృష్ణ ఆలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు ఆలయ కమిటీ, యాదవ సంఘం నాయకులు తెలిపారు. గురువారం ఆలయాన్ని శుద్ధిచేసి విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. వారు మాట్లాడుతూ శనివారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, గోపూజ నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి ఊరేగింపు వుంటుందని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

మత్తుతో జీవితం చిత్తు

గంగవరం: మత్తుతో జీవితాలు నాశనం అవుతాయని పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ తెలిపారు. మండలంలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం సే నో టూ డ్రగ్స్– ఎస్ టూ లైఫ్ కార్యక్ర మం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి కృషి చేయాలన్నారు. కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడడం, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడం చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం డ్రగ్స్‌ను నిర్మూలిద్దామని ప్రతిజ్ఞ చేశారు. అర్బన్ సీఐ ప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ ఎంవీఆర్.రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ, డైరెక్టర్ కిషోర్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

పుంగనూరు: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని బసవరాజ కళాశాల ప్రిన్సిపాల్ దయానందరాజు తెలిపారు. ఆయన గురువారం విద్యార్థులతో కలిసి పట్టణంలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌కు మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. విచ్చలవిడి శృంగారం వల్ల ఎయిడ్స్ వస్తుందన్నారు. ర్యాలీలో జనచేతన్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

గుడుపల్లె: గుడివంక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వి.కోటకు చెందిన శ్రీనివాసులు కుటుంబ సభ్యులు తయారుచేయించిన రథాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. హోమాలు చేశారు. స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చారు. భక్తులు హరోం హరా మురుగ అంటూ రథాన్ని లాగారు.

స్వామి వారి సేవలో జెడ్పీ చైర్మన్

గుడివంక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామిని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తుల అన్నదానం చేసేందుకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.20 లక్షలు ఇస్తామని జెడ్పీ చైర్మన్ హామీ ఇచ్చారు.

ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభం

సదుం: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో గురువారం ధ్వజారోహణంతో ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను నాలుగు రోజులు నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు శుక్రవారం స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. కృష్ణారెడ్డి, మల్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీధర్, మోహన్‌రెడ్డి, రాజన్న, పురుషోత్తం, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేడు మద్యం, మాంసం విక్రయాలు బంద్

పుంగనూరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మద్యం, మాంసం దుకాణాలు బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో హోటళ్లు, దుకాణాల్లో మద్యం, మాంసం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రిమినల్ కేసులు సైతం నమోదు చేస్తామన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మెడికల్ షాపుల్లో డీఐ తనిఖీలు

పలమనేరు: పట్టణంలోని పలు మెడికల్ షాపులను గురువారం చిత్తూరు ఇన్‌చార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వి.కీర్తన తనిఖీ చేశారు. ఆమె షాపుల వద్దకు వెళ్లి డాక్టర్ చీటీ లేకుండా మెడికల్‌షాపుల్లో అమ్మని ట్యాబెట్లు కావాలని అడిగారు. కొన్ని దుకాణాల్లో అవి తాము విక్రయించమంటూ సమాధానం చెప్పినట్టు తెలిసింది. ఇలా నాలుగైదు మెడికల్ షాపులను తనిఖీ చేసి వెళ్లిపోయినట్టు సమాచారం. డీఐ తనిఖీలు వుంటాయనే మాట ఇక్కడి మెడికల్స్ నిర్వాహకులకు ముందుగానే తెలిసినట్టు సమాచారం. దీంతో వారు జాగ్రత్త పడ్డారు. పట్టణంలోని పలు మెడికల్స్‌లో మెడికల్ రెప్‌లు ఇచ్చే శ్యాంపుల్స్‌ను సైతం విక్రయిస్తున్నారు. అలాంటి షాపుల వైపు వెళ్లకుండా అపోలో, ఆరోగ్యలాంటి ఫార్మసీలను చూసి చాలా చక్కగా ఉన్నాయంటూ వెళ్లిపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డీఐ తనిఖీల విషయాన్ని మీడియాకు సైతం చెప్పకపోవడంపైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రహస్య దాడుల వెనుక పెద్ద కథే ఉందని, సమయానికి చేరాల్సింది చేరకుంటే వెంటనే తనిఖీలు వుంటాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చంద్రబాబు హామీలన్నీ బోగస్సే



పెంచుపల్లెలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పుంగనూరు: చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చే హామీలన్నీ బోగస్సేనని ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి ఆరోపించారు. ఆయన గురువారం ఏతూరు, పెంచుపల్లి, బండ్లపల్లె, కుమ్మరనత్తం, చదళ్ల, నెక్కుంది, గుడిసిబండ తదితర పంచాయతీల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అమలు చేసిన పథకాల కంటే తాము ఎక్కువగా ఇస్తామని నమ్మించిన చంద్రబాబునాయుడు అసలుకే మోసం చేశారని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ అమలుచేసేశామని చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని నిలదీస్తున్న వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని తెలిపారు. ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అమరనాథరెడ్డి, బోయకొండ ఆలయ మాజీ చైర్మన్ నాగరాజరెడ్డి, జిల్లా యూత్ వింగ్ కార్యదర్శి కొత్తపల్లె చెంగారెడ్డి, ఎంపీటీసీ శివకుమార్, దేవదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, జయరామిరెడ్డి, పెంచుపల్లి కృష్ణ, ప్రశాంత్‌రెడ్డి, నాగరాజరెడ్డి పాల్గొన్నారు.

కూటమిలో భగ్గుమన్న విభేదాలు!

- పీఏసీఎస్ చైర్మన్ల నియామకంపై గుర్రు
- దూరమైన రెండు సామజిక వర్గాలు
- ఏఎంసీ విషయంలో ముభావంగా ఉన్న మరో వర్గం

పలమనేరు: పలమనేరు కూటమిలో విభేదాలు భగ్గుమన్నాయి. ఈ విషయం బుధవారం పీఏసీఎస్ చైర్మన్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బయటపడింది. తమ వారికి కాకుండా ఇతరులకు పదవులు ఇచ్చినందుక ఆగ్రహంతో కొన్ని సామాజిక వర్గాల వారు కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. పలమనేరు మండలంలో పలమనేరు, బయ్యప్పగారిపల్లి రెండు పీఏసీఎస్‌లున్నాయి. వీటిలో చైర్మన్ పదవులు ఇవ్వాలని కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులతోపాటు టీడీపీలో కీలకమైన కమ్మ సామాజిక వర్గ నేతలు అడిగినట్టు తెలిసింది. స్థానిక ఎమ్మెల్యే వారిని కాదని తన అనుచరులైన రెడ్డి సామాజికవర్గానికి చెందిన పెద్దబ్బను పలమనేరు సొసైటీకి, వెంకటమునిరెడ్డిని బయ్యప్పగారిపల్లి సొసైటీకి చైర్మన్లుగా నియమించారు. దీనిపై ఆగ్రహించిన కమ్మ సామాజికవర్గ నేతలు బుధవారం జరిగిన ప్రమాణ స్వీకారానికి డుమ్మా కొట్టారు. మరోవైపు జనసేన, బీజేపీ నేతలు తమకు పదవులు ఇవ్వలేదని ఎమ్మెల్యేపై అలిగినట్టు సమాచారం.

ఏఎంసీ చైర్మన్ విషయంలోనూ ఇదే తిరకాసు

నియోజకవర్గంలో ఏఎంసీ చైర్మన్ పదవి కోసం పలువురు ఆశావాహులు ఇప్పటికే ప్రయత్నాలు చేశారు. ఈ పదవి కురబలకే దక్కుతుందని చాలా మంది భావించారు. ఎమ్మెల్యే వాల్మీకి కులానికి చెందిన వారికి కట్టబెట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. దీంతో నియోజకవర్గంలోని కురబలు గుర్రుగా ఉన్నట్టు తెలిసింది. ఇదే పదవిని జనసేన నేతలు, కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు ఆశించారు. వీరికి దక్కకపోవడంతో అలకపాన్పు ఎక్కినట్టు తెలిసింది. రెండు సింగిల్‌విండోల్లో తమకు అవకాశం ఇవ్వనందున ఏఎంసీ పదవినైనా జనసేనకు ఇవ్వాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నట్టు కొత్తమాట వినిపిస్తోంది. మరోవైపు సింగిల్ విండో చైర్మన్లలో తమకు ప్రాధాన్యం లేనందున ఏఎంసీ చైర్మన్ తమకు ఇవ్వాలని టీడీపీలోని కమ్మ సామాజికవర్గ ఆశావాహకులు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. ఏదేమైనా నామినేటెడ్ పదవుల వ్యవహారం ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి తలనొప్పిగా మారిందనే మాట వినిపిస్తోంది.